నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | KAMAREDDY

గౌతంనగర్ చౌరస్తా వద్ద మాట్లాడుతున్న పిడమర్తి రవి

కులగణనతోనే వర్గీకరణ సాధ్యం

- మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22: కులగణనతోనే ఎస్సీ వర్గీకరణ, అన్ని కులాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మాదిగ సంఘాల రాష్ట్ర చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని గౌతంనగర్ చౌరస్తాలో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యలు అలాగే ఉండిపోయాయని తెలిపారు. కేవలం కులగణన చేస్తేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా నాయకులు శ్రీనివాస్, గోవర్ధన్, శివ, శివకుమార్, విజయ్‌కుమార్, మహేందర్, మహేశ్, రమేశ్, గణేశ్ పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 22: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు జిల్లాకు చెందిన 19,509 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, పరీక్షల నిర్వహణకు 37 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేల్ సలాం, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి, పరీక్షల నిర్వహణ కన్వీనర్ రఘురాజ్ అన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు కీలకమని పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర(ఖిల్లా) జూనియర్ కళాశాలలో సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు పరీక్షల నిర్వహణపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఏమరుపాటు లేకుండా చాకచక్యంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పరీక్షల నిర్వహణ కమిటీని సంప్రదించాలని సూచించారు. పరీక్షలను పక్కాగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మూత్రశాలలు, ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్ల నుంచి తీసుకవచ్చిన తర్వాత సీసీ కెమెరాల ముందు మాత్రమే ఓపెన్ చేయాలన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. 9 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించరాదని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144వ సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రజీయొద్దీన్ అస్లాం, దేవారాం, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ యకీనుద్దీన్, హైపవర్ కమిటీ ప్రతినిధి చిరంజీవి, అధికారి చిన్నయ్య, ప్రభుత్వ అధ్యాపకుల సంఘాల నాయకులు నర్సయ్య, లక్ష్మీనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

ధర్నాచౌక్ మార్పు

- పాత మున్సిపల్ ఆఫీస్ పక్కన స్థలం కేటాయింపు
- నిరసన, ఆందోళన కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి..
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 22: తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కొత్తగా స్థలాన్ని కేటాయించినట్లు సీపీ కల్మేశ్వర్ గురువారం తెలిపారు. కొత్తగా ఎంపిక చేసిన ప్రదేశంలోనే ప్రజలు, వివిధ సంఘాలు, సంస్థలు తమ నిరసన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు పాత కలెక్టరేట్ పరిధిలోని ధర్నాచౌక్ వద్ద ధర్నాలు నిర్వహించే వారని, దీంతో రైల్వే, బస్‌స్టేషన్లు, కోర్టు, దవాఖానలకు వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు, అడ్డంకులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆబాదీ ప్రాంతంలోని పాత మున్సిపల్ కార్యాలయం పక్కన ధర్నా కోసం స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఎవరైనా నిరసన కార్యక్రమాలు చేపట్టేవారు ముందస్తుగా ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

- పనితనానికి దక్కని ప్రాధాన్యత
- ఇష్టారాజ్యంగా ఉద్యోగుల స్థాన చలనం
- అప్పటికప్పుడు మార్పులు, చేర్పులు
- పోలీసు శాఖలోనూ ఇదే రకమైన తంతు
- రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం

కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో కార్యనిర్వాహక వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరిగింది. మూడు నెలల్లోనే హస్తం పార్టీ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తున్నది. సార్వత్రిక ఎన్నికలకు ముందు అన్ని శాఖల్లోనూ చోటు చేసుకున్న బదిలీలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ నాయకుల ఆశీస్సులతో కొందరు అనుకున్న చోటికి బదిలీ చేసుకోగా, మరికొంత మంది మాత్రం ఉన్న చోటే కొనసాగేలా చక్రం తిప్పారు. ఇలా కాంగ్రెస్ నేతల ఆశీస్సులతో, ముడుపుల వ్యవహారాలతో బదిలీల వరుస జరిగినట్లుగా అంతటా చర్చ జరుగుతున్నది.

-నిజామాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



అక్రమార్కులకు స్నేహ'హస్తం'? బదిలీలలెన్నో



అధికారుల బదిలీల్లో హస్తం ముద్రవేసుకుంటున్నది. అన్ని శాఖల్లోనూ తమకు నచ్చినవారే ఉండాలనే ఉద్దేశంతో అధికార పార్టీ నేతలు అధికారుల బదిలీలు చేయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇష్టారాజ్యంగా బదిలీలు చేపట్టడం ద్వారా ఆయా శాఖల్లో పని చేసిన ఉద్యోగులంతా అయోమయానికి గురయ్యారు. బదిలీ ఉత్తర్వులు విడుదలైన గంటల వ్యవధిలోనే నిలుపుదల చేయడం, ఆ వెంటనే మరో జీవో విడుదల కావడం విస్మయానికి గురి చేస్తున్నది. ఈ రకమైన జీవోల పరంపరలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ సందిగ్ధ పరిస్థితులు ఏర్పడ్డాయి.

బదిలీల్లో చమత్కారం...

నాలుగైదు రోజుల కింద బిచ్కుంద మండలానికి ఎంపీడీవోగా పర్బన్న వచ్చారు. ఆయన బాధ్యతల స్వీకరణకు ముందే నాగిరెడ్డిపేట మండలానికి బదిలీ చేశారు. కేవలం ఓ అధికార పార్టీకి చెందిన నాయకుల ఫిర్యాదులు, నియోజకవర్గంలోని ఓ కీలక నేత ఆదేశాలతో బదిలీ నిమిషాల్లో మారిందనే టాక్ వినిపిస్తున్నది. జుక్కల్ నియోజకవర్గంలోని మహ్మద్‌నగర్ మండల తహసీల్దార్‌గా క్రాంతి కుమార్ విధులు నిర్వర్తిస్తుండగా ఇతన్ని కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. మళ్లీ ఏమైందో కానీ యథావిధిగా కొనసాగుతున్నాడు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఓ సీఐ వ్యవహారం ఇప్పుడు పెద్ద దుమారం రేపుతున్నది. ఓ ఎమ్మెల్యే సిఫార్సుతో కమిషనరేట్‌కు వచ్చిన సీఐ తీరును ఓ ఉన్నతాధికారి తీవ్రంగా ఆక్షేపించినట్లు సమాచారం. దీంతో నొచ్చుకున్న సదరు పోలీసు ఇక్కడ విధులు చేపట్టేందుకు భయపడి వెనక్కి వెళ్లేందుకు సిద్ధపడినట్లు సమాచారం. తీరా సిఫార్సు చేసిన నాయకుడే రంగ ప్రవేశం చేసి హైదరాబాద్ స్థాయిలో పోలీస్ ఉన్నతాధికారులతో మాట చెప్పించుకుని తన పంతాన్ని నెగ్గించుకున్నట్లుగా తెలుస్తున్నది. సిఫార్సులతో వచ్చిన సదరు సీఐ ప్రస్తుతం అనుకున్న చోటనే విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఎప్పుడు ఏమవుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నట్లుగా సమాచారం. ఇటీవల కమిషనరేట్ పరిధిలో ఓ ఏసీపీ బదిలీ వ్యవహారంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎక్కడో పనిచేసే ఏసీపీని కాంగ్రెస్ నేతలు కావాలని ఇక్కడికి బదిలీపై తీసుకొచ్చినట్లు తెలిసింది. ఇక నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా అంకిత్‌ను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అనాలోచితంగా ఉన్నాయి. మేడారం మహాజాతర కొనసాగుతున్న కీలక సమయంలో ఐటీడీవో పీవోగా ఏటూర్ నాగారంలో పని చేస్తున్న ఐఏఎస్‌ను అక్కడ్నుంచి కదిలించడం సరికాదంటూ చర్చ నడుస్తున్నది. పాలకవర్గాల పదవీకాలం పూర్తయి నిస్తేజంగా ఉన్న జీపీలకు కీలక బాధ్యుడిగా ఉండాల్సిన అదనపు కలెక్టర్ ఇక్కడ రిపోర్టు ఇచ్చిన తర్వాత తిరిగి మేడారం డ్యూటీలో నిమగ్నమైనట్లు తెలుస్తున్నది. సమ్మక్క-సారక్క జాతర తర్వాతే బదిలీ చేస్తే సరిపోయేది కదా? అన్న వాదన వినిపిస్తున్నది. అనుకున్నదే తడవుగా రాజకీయ ఒత్తిళ్లతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని ప్రజలు భావిస్తున్నారు.

వదలరు... కదలరు...

నిజామాబాద్ జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేసే నలుగురైదుగురు అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదమవుతున్నది. రాజకీయ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ తమ పనిని కానిస్తున్నారు. రెవెన్యూలో దంపతులుగా వెలుగొందుతున్న ఓ అధికారి కలెక్టరేట్‌కు వచ్చి వివాదాస్పద భూముల వ్యవహారాల్లో అనేకమార్లు జోక్యం చేసుకొని గతంలో ఉన్నతాధికారులతో చివాట్లు తిన్నారు. కలెక్టరేట్‌కు వచ్చి ఏండ్లు గడుస్తున్నా కదలకుండా, వదలకుండా ఇతరులకు అవకాశం ఇవ్వకుండా చక్రం తిప్పుతున్నారు. ఈ వ్యక్తి వెనకాల భూముల వ్యవహారాలను చక్కబెట్టే కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేత ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఇతగాడిని మారిస్తే కబ్జాలకు ఇబ్బందులు తలెత్తుతాయని, సెటిల్‌మెంట్లకు అవకాశం ఉండదని అండగా నిలుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రెవెన్యూ సంఘం పేరిట మరొకరు ఇదే తీరులో మునిగి తేలుతున్నాడు. మొన్నటి వరకు తన సామాజిక వర్గానికి చెందిన ఓ ఉన్నతాధికారి ఆశీస్సులతో ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా వ్యవహారాలు నడిపించాడు. ప్రభుత్వం మారడంతోనే కాంగ్రెస్ నాయకుల చుట్టూ తిరుగుతూ బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేశాడు. తీరా బదిలీ వ్యవహారాలు రాగానే తన సీటుకు ఎసరు రాకుండా జాగ్రత్త పడుతుండడం గమనార్హం. బైపాస్ రోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నడిపిస్తున్న ఇతగాడు ఉన్నతాధికారులకే వాటాలు అప్పగించి తాను అనుకున్న పనులను చక్కబెట్టేసుకుంటున్నట్లు ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు. దళారీ మాదిరిగా వ్యవహరించే ఒకరిద్దరు రెవెన్యూ అధికారుల తీరును చూసి మరికొంత మంది కూడా ఇలాగే వక్ర మార్గంలో నడుస్తుండడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఈ వ్యవస్థను రూపుమాపాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలను మరిచిన మోదీ ప్రభుత్వం

రెంజల్, ఫిబ్రవరి 22: మోదీ ప్రభుత్వం మాటలే తప్ప హామీలను అమలుచేయకుండా.. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో వారం రోజుల్లో మరో రెండు పథకాలను అమలుచేస్తామని చెప్పారు. మండలంలోని కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి గ్రామాల్లో అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కూనేపల్లిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వారం రోజుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్ కార్డుదారులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో 75 శాతం కన్నా తక్కువ ఫలితాలు సాధిస్తే అందుకు పూర్తి బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి రూ. కోటిన్నరతో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు.విద్యార్థుల తల్లి దండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు స్వస్తిపలికి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. కళ్యాపూర్ గ్రామంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులకే అందజేయాలని అధికారులను ఆదేశించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మండలాధ్యక్షుడు మోబిన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.



కూనేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అర్ధరాత్రి వరకు పాన్‌షాపు ఓపెన్

- నిర్వాహకుడిపై కేసు నమోదు
- రెండు రోజులు జైలుశిక్ష విధించిన కోర్టు

వినాయకనగర్, ఫిబ్రవరి 22: జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి వరకు షాపు తెరిచి ఉంచిన ఓ నిర్వాహకుడికి న్యాయస్థానం రెండురోజుల జైలు విధించింది. నగరంలో రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో సీపీ కల్మేశ్వర్ తనిఖీలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటాక కూడా హోటల్స్, పాన్‌షాపులు, టీ స్టాళ్లు, మద్యం విక్రయాలు కొనసాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిబంధనలు పాటించని వ్యాపారం చేస్తున్నవారిపై కేసులు నమోదుచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. నిర్దేశిత సమయం తర్వాత తెరిచిఉంచుతున్న షాపులపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్ ప్రాంతంలో అర్ధరాత్రి పాన్‌షాపు నిర్వహిస్తున్న గైక్వాడ్ సంతోష్‌పై కేసు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

మతం పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం

పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి/ ఇందల్వాయి /సిరికొండ, ఫిబ్రవరి 22 : ఆలయాల నిర్మాణం అందరూ చేస్తారని, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సైతం యాదాద్రి పునర్నిర్మాణం చేపట్టారని, కానీ బీజేపీ మాత్రం అయోధ్యలో రామమందిరం నిర్మించి ఓట్లను దండుకోవాలని చూస్తున్నదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లిలోని సబ్‌స్టేషన్ వద్ద రాంరావ్ మహరాజ్ విగ్రహ 3వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించగా.. ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బంజారా సేవా సంఘంలో గిరిజనులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనులందరికీ పోడు భూములు అందేలా చూస్తామన్నారు. సిరికొండ మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించగా.. ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఇందల్వాయిలోని తిర్మన్‌పల్లి గ్రామశివారులో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో నూతన గదులు, ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదనపు గదుల నిర్మాణం కోసం రూ.5 కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ. 60 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

బడ్జెట్ సమావేశం.. గందరగోళం

- రూ.274 కోట్లతో మున్సిపల్ బడ్జెట్
- ఆమోదం తెలిపిన ఇందూరు నగరపాలక సంస్థ
- మీడియాను అనుమతించాలని కార్పొరేటర్ల డిమాండ్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22: నిజామాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బడ్జెట్ సమావేశం గందరగోళంగా మారింది. నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించగా.. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హాజరయ్యారు. రూ. 274 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. అయితే బడ్జెట్ సమావేశానికి మీడియాకు అనుమత్వి కపోవడంపై బీజేపీ కార్పొరేటర్లు మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తం గా మీడియాను అనుమతిస్తుంటే నిజామాబాద్‌లో ఎందుకు అనుమతివ్వడంలేదని వారు ప్రశ్నించారు. మీడియాకు అనుమతి విషయంలో అవసరమైతే ఓటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్ది సేపు సమావేశంలో గందరగోళం నెలకొంది. గత పాలకుల నిర్లక్ష్యంతోనే కార్పొరేషన్‌కు నిధులు రాలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా నగరమేయర్ నీతూ కిరణ్ మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి సుమారు రూ. 274 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.మున్సిపల్ ఆదాయం రూ. 90 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ల ద్వారా రూ. 177 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి, నిధుల సమీకరణకు సహకరించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కోరారు.మున్సిపల్ ఆదాయం నుంచి మౌలిక సదుపాయాల కోసం కేటాయించినట్లు చెప్పారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, కమిషనర్ మకరంద్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

నాడు నేడు

ఇరుకైన గది.. సాధారణ కుర్చీలు.. అరకొర వసతులు.. ఇదీ ఒకప్పటి మున్సిపల్ సమావేశంలో కనిపించే సన్నివేశం. అదే ఇప్పుడు అసెంబ్లీని తలపించే విశాలమైన హాలు, సౌకర్యవంతమైన కుర్చీలు, ఏసీ వసతుల నడుమ మున్సిపల్ సమావేశాలు కార్పొరేటర్లకు కొత్త అనుభూతిని పంచుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బల్దియా కొత్త భవనంలో సమావేశాలకు కార్పొరేటర్లు ఉత్సాహంగా హాజరవుతున్నారు.